మా ఊరి విశేషాలు చెబితే ఈ బస్తీ పిల్లలు నమ్మరు. చీమలపుట్ట దిటూరి కొమ్మన సరసయ్య దయ్యం తందనాలాడు తుంది. కరణం రామయ్య కూడా కళ్ళారా చూశాడు ఒకసారి. ఏదీ నిబ్బరముంటే ఒక బస్తీ అబ్బాయిని అర్ధరాత్రి వేళ వెళ్ళి చింతల బావిదగ్గర నిలబడమనండి చూద్దాం.

శివాలయంలో రోజూ ఎనిమిదోగంట అయ్యేసరికి గర్భగుడి తలుపు బిగించాల్సిందే. నడిరేయి దేవతలు వచ్చి, శివుణ్ణి అర్చించి దేవాలయ కాండం తా జరిపిపోతుంటారు. ఒకటి రెండు పర్యాయాలు ఊరి పెద్దలు పరీక్షించారు కూడా. గుడి సింహద్వారం దగ్గర నిల్చుంటే సరి. ఆ సెంటు వాసనల ఘుమ ఘుమా, ఆ గుడిగంటల గణగణా, ఆ మంత్ర పుష్పాల లయా, ఆ అపూర్వ వాద్యాల ఘోషా....అవన్నీనూ!

అంతెందుకూ? హనుమాయమ్మగారు మనిషేకదా? ఆమెకు ఆంజనేయస్వామి ప్రత్యక్షం! ఆమె రమ్మంటే వస్తాడు, పొమ్మంటే పోతాడు! భ్రాంతికి కొడుకు పుడతాడంటే కొడుకు! విశ్వానికి ఉద్యోగం దొరుకుతుందంటే దొరికిందన్నమాటే! మున సబు లోగిలి విరగబండుతుందంటే ఇహ ఆవిడ మాటకు తిరుగులేదు!

ఇంతా ఎందుకు చెప్పొచ్చానంటే మా ఊళ్ళో జరిగే విశేషాలు ఇన్నీ అన్నీ కావు.

ఒకసారి మా ఊళ్ళో అకస్మాత్తుగా పెద్ద గాలి దుమారం చెలరేగింది. అగ్రతికి కిష్టమ్మ గారి దొడ్లో మునగచెట్టూ, రామలింగయ్య ఇంటికప్పూ ఎగిరిపోయినై. ఇంత గాలి దుమారం రావడానికి కారణమేమిటా అని ఎవ్వరికీ తెలియలేదు. ఇలాగైతే రాత్రి చెన్న కేశవస్వామి ఉత్సవం ఏం జరుగుతుందా అని ధర్మకర్త దిగులుపడ్డాడు.

ఇంతలోకే బ్రహ్మాండాన్ని దించుకు వసోందా అన్నట్లు పెద్ద శబ్దం అయింది. అందరూ బితరపోయి వాకిళ్ళల్లోకి వచ్చి చూశారు. ఆకాశంలో ఒక వెలుగు గోళం వెళ్తోంది. నక్షత్రంగానీ రాలుతున్నదేమో ననుకున్నారు. పాపం, ఏ రాజకుమారునికి ఆయువు మూడిందో? నిజంగా నక్షత్రాలు దిగ్గరికొస్తే ఇంత పెద్దవిగా ఉంటాయి గామాలు!

ఆ వెలుగు కిందికి దిగుతున్నట్లు కనిపించింది. తరువాత అంతర్ధానమైంది. తరువాత ఆ శబ్దమూ ఆగిపోయింది. అదేం వెలుతురూ? అదేం కథా? అబ్బ, కళ్ళు విచ్చిచూడగలమా అంత వెలుతురు?

ఒకావిడ ఇంట్లోకి వెళ్ళి తలుపు బిగించుకుంది భయంతో. ఒకామె పొరుగింటి పుల్లం పిన్నితో చెబుతోంది ఆశ్చర్యంతో. ఒకామె నిశ్చేష్టురాలై నిల్చిపోయింది విస్మయంతో.

కరణం రామయ్య మనసు పికపికలాడింది. మునసబు వీరయ్య గబగబా వచ్చాడు రామయ్యతో ఆలోచించడానికి.

"మన ఊరికి విమానం వచ్చిందట్రా విమానం!" అని ఒక గొంతుక అన్నది.

"ఆఁ. ఆఁ. ఏమిటేమిటి? మన ఊరి కేమిటి? విమానం రావడమేమిటి?" అన్నది మరొక గొంతు.

"అది తులశమ్మగారి లోగిట్లో దిగిందట్రోవ్!" అని వినపడేసరికి కిష్టయ్యకు పై ప్రాణం పైనే పోయింది. ఇహ ఇది పీకులాట చేగమే! తన క్రిందికే నీళ్ళొచ్చినా యన్న మాట! అరి పీడిబండబడా, ఆ భగంతుడు అన్నీ నాకే ఎసరుపెడుతాడే! అని దిగులు పడ్డాడు కిష్టయ్య. భార్య తులశమ్మ ఇహ ఊగిపోతోంది.

కిష్టయ్య నాదగ్గరికి వచ్చాడు. "ఒరే అబ్బి, తులశి పొలంలో ఆగిందట్రా. తులశి పుట్టింటినుంచీ వొచ్చేసరికి వేర్శనగ పంటంతా ధ్వంసమైందా, ఇహ నన్నింట్లో బతకనివ్వదు. ఏం చెయ్యమంటావురా అబ్బీ? ఏదైనా ఉపాయం చెబుదూ" అని అడిగాడు.

ఇంతలోకే దాశరథి అన్నాడు: "కిష్టయ్య మామా! నీ వేర్శనగ పంటకేం ధోకాలేదులే. ఆ విమానం భూమ్మీద ఆనలేదట! చక్రాలు బాగా రొడ్డు మట్టానికి పైనే ఉన్నాయట!"

"ఆఁ. ఆఁ? ఏమిటేమిటీ?—నిజంగానే? విమానం చక్రాలు పొలంమీద ఆనలేదుగదా? గక్షించావ్ నాయనా! అయితే, అబ్బి, ఈ మాట నీ చెవిలో ఎవరు ఊదారురా?"

నిజానికి ఇంతవరకూ ఎవ్వరూ విమానం దగ్గరికి వెళ్ళి నింపాదిగా చూసినవారు లేరు. అబ్బయ్యగారి తోటలో నుంచో, సీతయ్య గారి గోడ మదుమీదనుంచో ఏదో అలాగు మీదనుంచో, చెరువు గట్టుమీదనుంచో చూసినవారేకానీ, ఎవ్వరూ పదిగజాల దూరంలోనుంచీ చూసినవారు లేరు. చూసి చూడకుండానే విమానం తెల్లగా వుందనీ, విమానంనిండా రత్నాలేననీ, విమానం వుండేది ఇలాగేనా అనీ, విమానం అంటే మరెలాగ ఉంటుందో అనుకున్నాననీ, ఆమడదూరం నుంచీ తర్జన భర్జనలు చేసేవారేగానీ, దగ్గరికి వెళ్ళి సంగతేమిటని వాకబుచేసిన నాథుడే లేడు.

కరణమూ, మునసబూ వలుగురు పెద్ద వాళ్ళను తీసుకుని ఆ విమానంగురించి అడగ టానికి వెళ్ళారు గానీ సగం దారిలోనే పెద్ద అంకడు "అడనూస్తే మా అయ్యలాగుంది బాబూ!" అని వెనక్కు తిరిగాడు. "అది నీ ఇల్లు బంగారంగానూ! పాతికేళ్ళ నాడు చచ్చిన అయ్య ఎక్కణ్ణించి వొచ్చాడురా?" అని మునసబు వీరయ్య పళ్ళబోయినాడు కానీ, అంకడు నాలుగడుగులు వేసి, "అమ్మ బాబోయ్, అయ్యోవ్! అయ్యా" అంటూ పట్ట పాలేనిక పరుగు తీశాడు.

అసలే లోట లోటమంటున్న కరణం రామయ్య గుండె నిలిచిపోయింది. "నాకు కాళ్ళాడడం లేదు వీరయ్యబావా!" అన్నాడు హీనస్వరంతో.

"ఏమిటయ్యా, రామయ్యా! నీకుకూడా అయితే ఇహ మన ఎంక్వైరీ ఏంగాను?" అని మునసబు అన్నాడే కానీ, అతనికీ గుండె దడ హెచ్చింది. ఇహ కాదనలేక రామయ్య ఏడుకొండలవానికి ముడుపు కడతానని మొక్కుకుని సాగాడు.

విమానం వందగజాల దూరంలో ఉండేవ గానే ఒక శబ్దం రామయ్య చెవిలో గింగురు మన్నది. "వీరయ్యబావా! నువ్వు తెగించి వెళ్ళగానీ, లక్ష వరాలిచ్చినా నేను రాను." అని "రారా నువ్వు" అని వెనక్కు తిరిగి పరుగు తీశాడు. మునసబూ ఏమీ పాలు పోక చేతులు జాడించుకుంటూ వెనక్కు మళ్ళాడు.

"ఆఁ. ఎక్కడైనా పెద్దంటి విమానం భూమిమీద ఆనకుండా నిలబడుతుందర్రా? మీ దంతా చాదస్తంగానీ?" అని హైస్కూలు టీచరు గురుమూర్తి అన్నాడు.

కిష్టయ్యకు నిజంగానే భయం వేసింది. అవును, భూమిమీద ఆనకుండా ఏ వస్తు వుంటుంది గనక? ఇహ ఊర్కుని లాభం లేదు. పంట పట్టిగడ్డలయ్యాక చేసేదేముందీ? శాస్త్ర సాహసం చిక్కబెట్టుకొని వెళ్ళి, పొలంలోనుంచీ వాళ్ళను ఖాళీ చేయించాలని నిశ్చయించుకున్నాడు. నన్నుకూడా తోడు రమ్మన్నాడు. ఇలాంటి అవకాశాలు ఎప్పుడోగానీ రావు. అందువల్ల నేనూ ఈ యాత్రకు తయారైనాను.

మేం వెళ్ళేలోపుగా ఆ నోటా ఆ నోటా పడి కొన్ని విశేషాలు తెలిసినై. అది పట్టి విమానం కాదట! అది దేవతా విమానం! అదే కుబేర పుష్పకం! దేవతలు పరివార సమేతంగా భూలోక యాత్రకు బయల్దేరారట.

పొద్దుగూకేసరికి వాద్య సంగీతాలూ, తియ్యని కంఠస్వరాలూ, నర్తకుల గజ్జెల చప్పుళ్లూ వినిపించేవి. రాత్రి పదిగంటలకు గుడి మంటపంలో ఇంద్రుడూ, రంభా క్రీడిస్తూ ముద్దు పెట్టుకుంటూ ఉండగా శీనయ్య చూశాడు. దిగుడు బావిలో అప్సరసలు జలక్రీడలాడటం నాగి చెట్టు చాటునుంచీ చూసింది. వాళ్లు ఎంత అందగత్తెలు! దేవతలంటే చాలా మంచివాళ్ళనీ, విమానం దగ్గరికి వెళ్ళినా వాళ్ళేమీ చెయ్యరనీ, అంతా చెప్పుకుంటున్నారు.

ఆ విమానంలో వరదయ్యకూతురు వెళ్ళిందనీ, ఇంట్లో భోజనం చెయ్యకుంటే చెయ్యనన్నదనీ అమృతం తాగినవారికి ఆకలేమిటనీ, తనువాతి ఆ మోసం ఉద్యోగించారిన రామారావుతో ఒక అరగంట గడిపిందనీ అంతా అనుకున్నారు. రామారావు నాతో "శాంత ముద్దు ఎంత మధురంగా ఉందనుకొన్నావ్? ఆ తెల్లటి వొళ్ళూ, ఆ నల్లటి కళ్ళూ, ఆ తియ్యటి గొంతూ — శాంత కౌగిలి ఎంత సుఖాన్ని కలిగించిందనుకున్నావ్?" అన్నాడు.

కాంతమ్మ కొడుకూ అలాగే వొచ్చి వాళ్ళమ్మకు కనిపించి వెళ్ళాడు. గుడ్డి గురవక్క కనబడ్డది. కానీ, చచ్చి ఏణ్ణర్థం అయినా నూకంబెటిమాత్రం కనపడలేదు. అతని భార్య మరీ మరీ చూసింది. కానీ అతను రాలేదు. అవును, లోకుల నోళ్ళను కొట్టి నల్లబజారులో బతికిన నూకంబెట్టికి స్వర్గం ఎలావస్తుందీ? అన్నారు చాలామంది. "ఒక వేళ ఇంకా వెయిటింగ్ లిస్టులో ఉన్నాడేమో!" అన్నాడు మెడికల్ కాలేజీ వెయిటింగ్ లిస్టులో ఉన్న హరిహర్.

జాకిదంతా తమాషాగా ఉంది. నాకు ఒక కథావస్తువు దొరికిందిగదా అని సంతోషించాను.

సాయంత్రం నాలుగోగంట కొట్టారు. గరుడోత్సవానికి అంతా తయారైనా ఒక వింత విమానం ఊళ్ళో ఉండగా తిరణాల జరపడానికి వీల్లేదని ఊరి కరణం ఆర్డరు జారీ చేశాడు.

కిష్టయ్య సరిగపేటు ఉత్తరీయం తీసుకుని, బుల్లిమీసాలను ఒక చేతితో సాగదీసుకుంటూ, వెండికొమ్ము చేతి కఱ్ఱను రెండో చేతితో భూమిమీద బాదుతూ తయారైనాడు. అతని చెవుల అంటుపోగులు తళుక్కున మెరిశాయి. కిఱ్ఱు చెప్పులను వాకిట్లోనే విడిచి, మా ఇంట్లోకి వచ్చాడు. నేనూ త్వరగా తెముల్చుకుని బైటపడ్డాను. నా మిత్రుడు దాసూ ఉబలాటపడి మాతో వచ్చాడు.

కుబేరపుష్పకాన్ని సమీపించాం. అది ఎకరన్నర పొలందాకా ఆక్రమించుకున్నది. ఎటు చూసినా విమానం అంతా మణులూ, రత్నాలూ.

ఇంతలోకే ఎక్కణ్ణుంచో గొంతు వినిపించింది. కిష్టయ్యా నేనూ ఉలిక్కిపడ్డాం.

"అలా పల్లెటూరి బైతుల్లా భయపడతారేం?" మళ్ళీ వినిపించింది ఆ తియ్యని గొంతు. కిష్టయ్య ఉత్తరీయం సవరించుకుని, చేతి కఱ్ఱను జాడించి వికారంగా నిలుచున్నాడు. నేనూ ఆ మోహనాంగిని చూసి ముగ్ధుడినైనాను. "రండి" అన్న ఆ వగలాడికంఠం, ఆ కనుసైగా నాలో మధుర భావాలను పెకలించుకు వచ్చినై.

లోపలికి వెళ్ళాం. చూస్తే చిన్నదిగా వుంది. ఇందులో ముక్కోటి దేవతలూ ఎలా ఎక్కగలరా అనిపించింది. అయితే, ఎటు చూసినా వాకిళ్ళు. ఎటుపోవలసిందీ మాకు తెలీలేదు. ఆ సుందరి కనబడలేదు. ఒక వాకిట్లోనుంచీ తొంగిచూశాం, అవతల ఒక హంసతూలికా తల్పం. దానిమీద ఒక అప్సరసను "మేనకా!" అంటూ ఒక సుఖపురుషుడు పి కౌగిలించుకుంటున్నాడు 'అపచారం, అపచారం' అని ఇవతలికి వచ్చి మూడో వాకిట్లోకి చూతుముగదా — పెద్ద హాలూ అందులోనుంచి మరో గదిలోకి దోవా — అవతల మరో వాకిలి — చివర ఒక ఉద్యానవనం — అక్కడ ఒక జంట పాడుకుంటూ ఆడుకుంటున్నారు. 'హరిహరీ' అని కిష్టయ్య ఇవతలికి వచ్చి నిలబడ్డాడు.

"ఇంకా రారేం?" అన్న సన్నగి కంఠం "ఇటూ, అయిదో నెంబరు వాకిట్లోనుంచీ!" మళ్ళీ వినిపించింది.

## దృష్టిభేదం

ఒక షావుకారు తనకొట్టును మరొకనికి అమ్మివేస్తూ ఆ స్థలం ఎప్పుడూ జనంతో కిటకిట లాడుతూఉందనీ వ్యాపారం బాగా సాగుతుందనీ ధైర్యం చెప్పాడు. కొన్ని నెలలు గడిచాక కొత్త షావుకారుకు పాత షావుకారు కనపడ్డాడు.

'ఏమండీ ఈ కొట్టు అమ్మిందెవరో మీరా కేదమా?'

'అవును. ఇప్పుడేం వచ్చిందీ? నే చెప్పినట్టు వ్యాపారం లక్షణంగా సాగుతూందా?'

'ఆ బాగా సాగుతోంది! ఈ ప్రదేశంలో జనం రద్దీగా తిరుగుతారని చెప్పారు.'

'అవును. అలాగే చెప్పాను. చూడండి జనం రద్దీ.'

"జనం రద్దీ మరీ యెక్కువయింది లెండి!"

లోపలికి వెళ్ళాం. చలవరాతి నేలా. అది అద్దాలమహల్. ఎటుచూసినా మేమే — కిష్టయ్యా, నేనూ, దాసూ, "ఇటూ ఇటూ" అని మళ్ళీ దారిచూపింది. మేం అటువైపు వెళ్లాం. అక్కడ సోఫాలో ఒక రతిరాజు కూచున్నాడు: "ఏం?" అన్నట్టు చూశాడాయన.

"మ....మ....మరీ..." అన్నాడు కిష్టయ్య.

"భయమెందుకూ? మేం తిడుతామా? కొడుతామా?"

"ఈ పొలం మాదీ. పంటంతా —" అని నేను అంటుండగానే "మణిహారం ఒకటీ" అన్నాడాయన. ఇహ ఆయన ఎటు మాయమైనాడో కనబడలేదు. మేము ఎక్కడున్నామో కూడా నాకు తెలియలేదు.

మేం సోఫాలలో కూచుని ఉన్నాం. ఇద్దరు అప్సరసలు వచ్చి మా పక్కన కూచున్నారు. "ఆరగించండి." అని రెండు గ్లాసుల్లో పానీయం అందించారు మాకు.

"నేను పుచ్చుకోను. మా పూర్వుల మద్యపాన నిషేధం" అన్నాడు కిష్టయ్య.

"ఇది అమృతం. మద్యం కాదు." అని ఆ యువతి అన్నా కిష్టయ్య తాగ లేదు. "మీరు తాగకుండా వెళ్ళటం మాకు మర్యాద కాదు. తాగితీరాల్సిందే!" అని కిష్టయ్య నోరు తెరిచి గొంతులో పోసిందామె.

నేను గబ్ చుప్ గా తాగేశాను. నాకు కిన్నెర కులో లోటా అందించింది. అదీ తాగేశాను. ఆమె నాకు దగ్గరగా వచ్చింది.

ఇంతలో ఏదో కొంప మునిగి పోయిందన్నట్టు "ఇహ పోదామా?" అన్నాడు కిష్టయ్య. "మరి మణిహారం మాటో?"

"ఇచ్చేశాంగా?" అన్నదామె.

"ఎప్పుడూ?"

"ఏదీ జేబీలో చూసుకోండి." అన్నదామె. ధగధగా మెరిసింది మణిహారం!

దారితప్పి కలుసుకున్న వాడిలా దాసు ఎక్కణ్ణుంచో వచ్చాడు. "మీ ఫోటో ఒకటి ఇస్తారా — మానవులం మేం కలలు కనటానికీ...ఫిలిం పత్రికలలో ప్రకటించి అందం అంటే ఏమిటో రుచిచూపటానికీ..."

"ఫోటో గిటో జాంతానై" అన్నదామె.

"పోనీ, నేనింకా కాస్సేపు ఉండవచ్చా?" అడిగాడు దాసు.

"ఆహా, ఉండవచ్చు."

కానీ కిష్టయ్యా, నేనూ ఇంటికి వచ్చేశాం. మళ్ళీ మామూలు ప్రపంచంలో అడుగు పెట్టేదాకా మేం మానవులమో దేవతలమో, బతికి ఉన్నామో చనిపోయినామో కూడా తెలీని అగమ్యగోచరంగా ఉంది.

"పొలంలో మానాన్నకు భాగ్యానికి మణిహారం బాగుగా?" అని నిట్టూర్చ పోయాడు కిష్టయ్య. తులశమ్మ ఊరినుంచీ వచ్చింది. ఆ మణిహారాన్ని చూసే సరికి ఇహ ఆ విమానం అక్కణ్ణుంచి కదలక పోయినా ఫరవాలేదనుకుంది. కరణంగారి భార్య భోజ్జమ్మ "హయ్యోరామా! ఆ దిగిన విమానం కాస్తా నాలుగడుగులు జరిగి మన పొలంలో దిగి వుండరాదా?" అని వాపోయింది. మరో దఫా వస్తే ఆ కాస్త పొరపాటూ జరగక పోతుందా అని ఆశించిందామె.

మానాన్నకి ముచ్చట బాగానే ఉందిగానీ, తరువాత కొత్తొక వింత పాతొక రోతా అయింది. కరణంగారికీ, మునసబుగారికీ రిపోర్టు మీద రిపోర్టులు వొస్తున్నాయి. రాత్రి తెల్లవార్లూ వాద్య సంగీతాల గోలతో నిద్ర చెడిపోతున్నదని ఒకాయన, విమానం చూట్టానికి వెళ్ళినవారందరికీ అమృతమని చెప్పి ఏదో మత్తుమందు పోస్తున్నారని ఒకాయన, ఆ ఊళ్ళోకల్లా అందగత్తె అయిన తన కూతురు సాయంత్రం పోతిరాజు బావికి నీళ్ళకు వెళ్ళిన మనిషి మర్నాటిదాకా రాలేదని మరొకాయనా, చచ్చిపోయిన భర్తను బతికి వచ్చానని మా శశితో సరసాలు ప్రారంభించాడని ఒకాయనా, ఇంగ్లీషు సినిమాల్లోలాగా వీధి చేసిన వాళ్ళలా పట్టపగలు నట్టనడివీధుల్లో ప్రేయసీప్రియులు ముద్దు పెట్టుకోటాలూ, కౌగిలించుకోటాలూ ఇదేం విరగబాటని ఒకాయనా.

ఎలాగైతేనేం ఆ విమానాన్ని ఊరినుంచీ లేవదియ్యాల్సిందే నని అంతా తీర్మానించుకొన్నారు. మాటవరసకు అనుకుంటాం గానీ, నలుగురూ నాలుగు చేతులు వేస్తే అది లేస్తుందిగనకనా? అది దేవతావిమానమాయె. పోనీ పూర్తిగా కదలకపోయినా నాలుగడుగులు జరిగి తన పొలంలో పడితే, తన పంటైనా పండుతుందని భోజ్జమ్మ అనుకున్నది.

ఇలాగ కాదని, కొలతలు పట్టుకొని గట్లు పెట్టించడానికినీ, పొలం మరమ్మత్తు చెయ్యటానికినీ కరణం మునసబులు పరివార సమేతంగా బయల్దేరారు.

విమానంమీదనుంచీ ఆహ్వానించిన పువ్వుబోడిని చూసేసరికి రామయ్య జావైపోయాడు. వీరయ్య రామయ్యను భుజంతో తోశాడు.

"మె....మె....మేం...కొలతలకొచ్చాం. కాస్త—" కరణం వణికాడు.

"రేపు" అని ఆవిడ వెళ్ళిపోయింది. కరణం బిక్కమొహం వేసుకుని, కొశ్చెన్ మార్కులా మునసబును చూశాడు.

అంకడు విమానాన్ని కదిలించి చూద్దాం కదా అని తాకాడుగదా ఇంకేముందీ కొండ తేళ్ళు కుడుతూ గొడ్డుమీదికి వెళ్ళి పడ్డాడు. "చెయ్యంతా ఎలకట్రోరు పావురు లాక్కుపోవాదిరా" అన్నాడు ఏడుస్తూ.

"సెబాస్, దొరా! తెల్లోడి బిసకంతో మింటిపోవాది దొరా!" అన్నాడు వీరిగాడు.

ఇదంతా కర్ణాకర్ణిగా విన్నాను. తరవాత దాసు వొచ్చి అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

"అయితే దాసూ తరువాతేం జరిగింది?" అని అడిగాను.

"ఏం చెప్పనురా బ్రదర్. అది స్వర్గమేరా. కీర్తిశేషులైన వ్యక్తి లెవరితోనైనా ఒక అరగంట గడపాలని ఉన్నదా అని అడిగింది ఒక జవరాలు. నేను ఇటూ అటూ చూశాను. ఎవరితో మాట్లాడుదామా అని బుర్ర బిగించి ఆలోచించాను. అన్నమ్మవ్వతో మాట్లాడదామా అంటే "ఒరే అబ్బీ! నువ్వు పెళ్ళిచేసుకుంటే చూడాలనుందిరా" అంటుంది. పిచ్చయ్య తాతతో మాట్లాడదాం అంటే ఆయన "కళావతి ఎలాగుందిరా." అని అడుగుతాడు. ఇంతలోకీ నాతో కాలేజీలో చదివి, తన ప్రేమను నామీద వెదజల్లి అకస్మాత్తుగా కన్నుమూసుకున్న నిర్మలను చూడాలనిపించింది. తీరని కోరికలన్నీ కరడుగట్టిన వాంఛలన్నీ కరిగిపోయినాయంటే నమ్మరా బ్రదర్! "నిర్మలను చూడాలనుంది." అన్నా. "ఏ నిర్మలను?" అన్నదామె. "ప్లీడరు రాఘవయ్యగారి రెండో కూతురు నిర్మలను" అన్నా. ఆ మరుక్షణంలో నిర్మల వచ్చి, అమాంతం నన్ను కావలించుకుంది. "నిర్మలకీ సాహసం ఎక్కడనుంచి వచ్చిందా అని ఆశ్చర్య పడ్డాను. తరువాత—" అని దాసు తన మధుర క్షణాలనుగురించి వివరించాడు.

సాయంత్రం అయింది. శాంత వచ్చి కడసారి రామారావును కలుసుకు పోయిందిట.

ఆరాత్రే మళ్ళీ మొదటిలాగా పెనుగాలి వీచింది. ఈ తడవ వీరయ్యగారి దొడ్లో పాక లేచి పోయిందట. వాద్యసంగీతాలూ, మధుర స్వనాలూ, విమానం మొత్తం ఒక వెలుగు గోళం తారాజువ్వలా ఎగిరిపోయింది.

గ్రామస్థులంతా వాకిళ్ళలోకి వచ్చి విస్మయంగా చూశారు. కుబేర పుష్పకం వెళ్ళిపోయింది.

నేటికీ అప్పుడప్పుడూ వాకిళ్ళలోకి వచ్చి చీకటి ఆకాశంలో మళ్ళీ ఆ వెలుగు గోళం కనిపిస్తుందేమోనని ఆశతో చూస్తుంటాను. రామారావు అనుక్షణమూ శాంతకోసం నిరీక్షిస్తానే ఉంటాడు. భోజ్జమ్మ ఈసారి విమానం వస్తే తన పొలంలోనే దిగుతుందని దృఢంగా విశ్వసించింది. నేనూ ఈ దాసుబల్ల ముందు కూచుని నిరీక్షిస్తున్నాను—ఆ విమానం రెండోమాటు ఎప్పుడు వచ్చి మళ్ళీ అపూర్వానుభవాలను అందిస్తుందా అని. ★

రత్నపురుషవేహ్యం
ఖిలగాడు వైద్యుడిచినది. మేహము, విక్లాక. అజీర్ణము, శుక్ల నష్టము, పొల మూలిక కార్ల తపులు, ఇతర నరములకు సంబంధించిన వ్యాధులు, మూత్రవ్యాధులు మొదలగు వానిని హరించి బలమును, కాంతిని ఇచ్చును. రెండు డబ్బాలు చాలును.
20 రు. డబ్బా రు. 3-12-0 వి పి 1/-
ఇండియన్ మెడికల్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు-విజయవాడ-2